క్లుప్తంగా

ఫిష్ ఆంధ్ర మినీ షాపు ప్రారంభం



షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: పట్టణంలోని ఆలూరు రోడ్డులో రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మినీ షాపును ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. చేపల మార్కెట్‌లో షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీతో రుణాలు అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కౌన్సిలర్లు విద్యారాణి, సుమోబాషా, నూర్ నిజామి, ఎండీఆర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పామిడి: స్థానిక కొత్త ఆర్టీసీబస్టాండ్ సమీపాన ఆదివారం ఎస్ఆర్ ఫర్నీచర్ ప్రొప్రైటర్ ఏ రవికుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని వీఆర్వో భాగ్యమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పొళ్యం తిమ్మప్ప, ఆదినారాయణ, లక్ష్మినారాయణ, కొత్తరాయుడు, అంజి, సుధాకర్, సూర్యనారాయణ, శివ, అభిరామ్, శ్రీనివాసులు, నాగార్జున, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

తాడిపత్రి టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యల్లనూరు రోడ్డు అపార్ట్‌మెంట్‌లోని మహిళలకు గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే ఎలా ఆర్పాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఆఫీసర్ మోహన్‌బాబు, సిబ్బంది రామయ్య, రామాంజనేయులు, నవీన్, షకీల్, శ్రీనివాసులు మహిళలు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యాడికి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ అలెగ్జాండర్ ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని సూచించారు. స్పందన కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల అందజేత



క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో ఆదివారం క్రికెట్ క్రీడాకారులకు ఆర్డీటీ సంస్థ సభ్యులు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ గ్రాస్ రూట్ కో–ఆర్డినేటర్ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. 8 నుంచి 18 సంవత్సరాల లోపు గల క్రీడాకారులు క్యాంపునకు హాజరు కావచ్చన్నారు. సదావకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం బైక్‌పై నుంచి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు. అనంతపురానికి చెందిన శ్రీనివాసులు పని మీద బైక్‌పై గుత్తికి వచ్చాడు. పని పూర్తి అయ్యాక తిరిగి బైక్‌లో అనంతపురం బయలు దేరాడు. అయితే పట్టణ శివారులోని అనంతపురం రోడ్డు లో బైక్ అదుపు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం చైత్రమాస బహుళ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గీతా పారాయణం, స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు అర్చకులు జయరామారావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 34వ వార్డు పరిధిలోని నందలపాడులో ఆదివారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. నందలపాడు సర్కిల్‌లో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పూల రూప, వైఎస్సార్ సీపీ నాయకుడు పూల బాలరాజు, సునిల్‌తో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని తెలియజేశారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని కోరగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సచివాలయ సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమత, పార్టీలకు అతీతంగా మన రాష్ట్రంలో సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. అర్హత కల్గిన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. అంతేగాక గ్రామీణ ప్రజలకు అందుబాటులో పాలన కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటే అందుతున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నేరాజు, కౌన్సిలర్లు రాఘవేంద్ర, ఆకుల చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, విజయభాస్కర్, పట్టణ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు గురుశంకర్, దివాకర్, బాబయ్య, జావీద్, పేరం ప్రతాపరెడ్డి, నాగభూషణం, దూల రఘు, సుబ్బారెడ్డి, కృష్ణయ్య, పాతకోట ప్రసాద్, బషీర్, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య పట్టణ సీఐ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివ లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో తాగునీటి ఎద్దడి నివారణకు మున్సిపల్ అధికారులు, పాలక వర్గం ఆదివారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొత్త బోరు ఏర్పాటు చేశారు. కొత్త బోరు ఏర్పాటు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, ఫరూక్ పర్యవేక్షించారు. రెండు రోజుల్లో పైప్‌ల్లో బోరు, పైప్‌లైన్‌ల ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం చిత్రపటం వద్ద ఆర్డర్ కాపీలతో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు

తాడిపత్రి టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని డీఎస్సీ–98 ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో ఆదివారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి వారు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1998లో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైనప్పటికీ అప్పటి ప్రభుత్వాలు తమకు పోస్టింగ్ ఇవ్వలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ కష్టాలను గుర్తించి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చి తమ జీవితాల్లో వెలుగు నింపారన్నారు. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, రామ్మోహన్, జయచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, హుస్సేనప్ప, సుబ్బరాయుడు, వెంగమనాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రామదాసు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, పామిడి వీరా

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామంలో కత్రిమల ప్రభాకర్‌చౌదరి తండ్రి కత్రిమల రామదాసు(80) ఆదివారం వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి తదితరులు కత్రిమలకు వెళ్లి రామదాసు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత ప్రభాకర్ చౌదరి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా పీ కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఎల్ సూర్యనారాయణరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం ఆయన్ను కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్ పరామర్శించారు.

జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందాం



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని గుడిపాడు ఉప సర్పంచు శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు పేరం వెంకటరామిరెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని గుడిపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్‌సీపీ నాయకలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పేరం సునీత, డీలర్ రామచంద్రుడు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



ముస్లింలకు విందు వడ్డిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే పలు మసీదుల్లోని ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. ఆయా ముస్లింల మత పెద్దలతో మాట్లాడి తాడిపత్రిలోని 28 మసీదుల్లో సాయంత్రం ఇఫ్తార్ విందుకు సంబంధించిన వంటకాలను ఒకే చోట తయారు చేయించి, వాటిని ఆయా మసీదులకు పంపి, ఉపవాస ప్రార్థనల అనంతరం ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. సాయంత్రం ఆయా మసీదులకు సరఫరా చేయబడిన వంటకాలను ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి స్వయంగా వడ్డించారు. హర్ష మెయిన్ బజార్, టైలర్స్ కాలనీల్లోని మసీదులకు వెళ్లి ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం గ్రామంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతున్నారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ముగిసిన నవకోటి దత్తహోమం



అనంతపురం కల్చరల్: నగరంలో మూడురోజుల పాటు జరిగిన నవకోటి దత్తహోమాలు ఆదివారం ముగిశాయి. దత్తాత్రేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలోని పాతూరు దత్తాత్రేయస్వామి ఆలయంలో రుత్వికులు వేర్వేరు హోమ గుండాల వద్ద శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతితో దత్తహోమం ముగిసినట్లు నిర్వాహకులు అప్పా సుధీర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్లలో ఓ మహిళ అనారోగ్యసమస్యలతో ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ కొన్ని నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన లక్ష్మిదేవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న లక్ష్మిదేవిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో శివమణి అనే బాలుడిని ఆదివారం కుక్క కాటువేసింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన శివమణి స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. అయితే ఆదివారం సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్తుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపడింది. గాయపడిన బాలుడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కంటి వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌వీ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 400 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహింఆచరు. ఇందులో 237 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు ఎంపిక చేసినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి బెంగుళూరు శంకర్ కంటి ఆస్పత్రిలో కంటి ఆపరేషన్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ సీనియర్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, టీటీసీ చైర్మన్ బండారు శివ, సభ్యులు శేషఫణి, సుబ్బరామయ్య, భూమా నాగరాగిణి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: తక్కళ్లపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శక్తి డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నంద్యాలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ మహేశ్వరరెడ్డి ప్రారంభించారు. మొత్తం 120 మందికి వైద్య పరీక్షలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఇరుముడి



రైల్వేస్టేషన్‌లో అయ్యప్ప స్వాములను సాగనంపుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మాలధారులు ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారులు మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నక్కా భీమలింగప్ప, మాజీ పట్టణ కన్వీనర్ ఎద్దల శంకర్, శరణ బసిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు లింగన్న, వై.సుధాకర్, మార్కెట్ వెంకటేష్, టీవీఎస్ షోరూమ్ మల్లికార్జున రెడ్డి శబరిమలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి వారికి వీడ్కోలు పలికారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేవేంద్రప్ప, నూర్ నిజామి, జింకల రామాంజనేయులు తదితరులు ఎమ్మెల్యే వెంటున్నారు.

ఘనంగా వరూధిని ఏకాదశి



పాండురంగస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి, చిన్న విఠోబస్వామి ఆలయాల్లో ఆదివారం వరూధిని ఏకాదశి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి, రుక్మిణీపాండురంగస్వామి దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథశర్మ, వెంకటేశ్వరశర్మ స్వాములకు అభిషేక, అర్చన వంటి ప్రత్యేక ఏకాదశ పూజలు చేశారు. భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈసందర్భంగా భజన బృందం ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి,రుక్మిణీ సమేత స్వామి ఉత్సవ విగ్రహాలకు పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణాలు గోవింద, పాండురంగస్వామి నామస్మరణతో మార్మోగాయి.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్టపై వెలసిన హజరత్ సయ్యద్ అహ్మద్ పీర్ ఖాద్రీ మసీదు వద్ద నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్ద సయ్యద్ అహ్మద్ పీర్ ఖాద్రీ సాహెబ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా ఫాతిమా మసీదు నిర్వాహకులు మహమ్మద్ ఆలీ ముస్లింలకు ఏటా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 145 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఫాతిమా మసీదు ముతవల్లి జాఫర్, సభ్యులు షరీఫ్, నబీరసూల్, జిలాన్ రబ్బానీ, మహబూబ్‌బాషా, డిజిటల్ సాబ్ శర్మాస్‌వలి, సాదిక్ వలి, అన్సర్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. బోలెడు ప్రయోజనాలు

- కలుపు, చీడపీడలు నివారించొచ్చు
- ముందు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి
- రాప్తాడు వ్యవసాయాధికారి శుభకర్





రాప్తాడులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతన్న

రాప్తాడు: వేసవి దుక్కులతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూమి సారవంతమై, సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. కలుపు, చీడపీడలు నివారించొచ్చు. పంటల సాగు పూర్తయ్యాక రైతులు భూములు అలాగే వదిలేస్తే భూమిలోని సారం దెబ్బతిని పంటలపై ప్రభావం పడుతుంది. భూమిలోని లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తుంది.. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంటలు చేతికందగానే దుక్కులు చేసి, భూమి ఆరబెట్టాలని రాప్తాడు ఏఓ శుభకర్ తెలిపారు. ఇలా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, సమగ్రసస్యరక్షణలో వేసవి దుక్కులు ఉపయోగపడతాయని ఆయన రైతులకు సూచిస్తున్నారు.

కలుపు మొక్కల నివారణ :

భూముల్లో పంట పెట్టకుండా అలాగే ఉంచితే కలుపు పెరిగి, భూసారానికి నష్టం కలుగుతుంది. చీడపీడలకు ఆశ్రయం కలుగుతుంది. మొండి జాతికి చెందిన తుంగ అన్ని రకాల భూముల్లోనూ ఎదుగుతుంది. బహువార్షిక వేర్లలో ఆహారాన్ని నిల్వ చేసుకొని భూసారాన్ని దెబ్బతీస్తుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల వీటిని నివారించొచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు చేయడం వల్ల వేరుశన, పత్తి, కంది, చెరకు, పండ్ల తోటలను ఆశించే లద్దెపురుగు, బొంత పురుగు, పుచ్చపురుగు, దాసరి పురుగు, భూమి పొరల్లో దాగిన చీడ పురుగుల గుడ్లు, కోశాలు వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయట పడిన ప్యూపాలు, గుండ్లను కొంగలు, పక్షులు తినడంతో పంటలకు చీడ పురుగుల బాధ తప్పుతుంది.

వర్షాకాలనికి ముందే దుక్కులు చేయాలి..

వర్షాకాలం రాక ముందే భూమిని మూడుసార్లు దుక్కులు చేయాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్లు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా అడ్డంగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే అవకాశం ఉంటుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించొచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. దీంతో భూమిసారవంతం అవుతుంది. తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూములను అలాగే వదిలేస్తే పొరలు గట్టిపడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకునిపోదు. దీంతో పోషక పదార్థాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్ల సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాములు సంతతి వృద్ధి చెందుతుంది.

ఖర్చు తగ్గించుకోండిలా..

కేవలం ఒక పంటకు రూ.60వేలు ఖర్చు పెట్టడం కన్నా చక్కటి యాజమాన్య పద్ధతులతో సాగుకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే భూసారాన్ని పరీక్షించి, లోపాలుంటే వాటికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలు అందించాలి. మొలకలు నాటిన అనంతరం చీడపీడల నివారణకు రూ.వేలు ఖర్చు చేయకుండా వేప నూనె, పంచగవ్య, ఎర పంటలను సాగు చేసి తెగుళ్ల సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టొచ్చు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని నీటిని పారించే పద్ధతి కన్నా బిందు సేద్యం అవలంబించాలి.

సహ చట్టంపై అవగాహన అవసరం

అనంతపురం కల్చరల్: సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన అవసరమని జిల్లా సహ చట్టం పరిరక్షణ సంఘం ప్రతినిధులు వన్నూరప్ప, నబీరసూల్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని సమాచార హక్కు చట్టం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 26న కలెక్టర్‌తో సంస్థాగత విషయాలపై చర్చించాలని, 28న జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇతర సంఘాల ప్రతినిధులకు చట్టంపై అవగాహన పెంచే సదస్సులు నిర్వహించాలని, అన్ని నియోజకవర్గాల కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, బంగారు కవచం ధరింపజేసి, విశేష పూజలు చేశారు.